సుందరి - సుబ్బారావు

సెకండరీ గ్రేడు మేష్టారు సుబ్బారావుకి పాపం తీరుబడి లేదు.

అతనికి కాలం చాలా యిరుకుగా వుంది. ఇరుకుగా ఇటూ అటూ ఊచలతో కట్టిన బోనులాగ 'కారిడర్'లాగా వుంది.

అతని వెతల్లాంటి ఆశయాలు సరదాగా ఇటూ అటూ పచార్లు చేయడానికి వీలులేకుండా వుంది.

ఇరవై నాలుగేళ్ళ సుబ్బారావు ముంగురుల మీద నుంచి కలలు జారుతుంటాయి. కృష్ణశాస్త్రి చెప్పినట్లు. కృష్ణశాస్త్రిగారు అతన్ని గురించి చెప్పలేదనుకోండి. అయితే సుబ్బారావుకి ఎందుకు తీరుబడి లేదు ?

అతను లేచిన కాస్సేపట్లో స్నానానికి వెళతాడా ! అక్కడ నూతి గటుమీద తువ్వాలుకట్టుకొని చేదమీద చేద తీసుకుని నీళ్ళు పోసుకుంటూంటే నీటి బిందువులు ముత్యాల్లా ఎర్రని వొంటిమీదనుండి జారతాయి. ఉదయసూర్యుడి చిరువెచ్చని కాంతిలో మెరుస్తాయి. రోజూ పాలుపోసే గొల్లపిల్ల మాత్రం రెప్ప వాల్చకుండా ఆశగా తన వొంటికేసి చూస్తుందని సుబ్బారావుకి తెలియకపోలేదు. కాని వృత్తి గొల్లపిల్లలు మాసిన బట్టలతో, ఆశలతో అందంగా లేని గొల్ల పిల్లలు తనకథలో నాయికలుగా వుండడానికి అంగీకరించలేదు సుబ్బారావు.

సబ్బు తీసి వొళ్ళు తోముకుంటూంటే సుబ్బారావుకి [illegible] తన ఛాతీమీద: జబ్బలలోని, పిక్కలలోని కండల యొక్క సౌష్ఠవం

ఏదో గర్వాన్నీ హాయినీ కలిస్తుంది. ఇంత భౌతికంగా వాస్తవంగా ప్రత్యక్షమవుతున్న ఆ బలాన్నీ యౌవనాన్నీ చూసుకుని మురిసిపోకుండా ఉండలేకపోతున్నాడు సుబ్బారావు.

అలాగ గర్వపడనివాడు వట్టి ఆధ్యాత్మికవాది. సుబ్బారావుకి ఆధ్యాత్మికవాదులంటే అంత నమ్మకం లేదు.

చక్కగా కమ్మేచ్చున తీసినట్లు- సంస్కృత కవులు వర్ణించిన దేహపుష్టిలాగ, హాలీవుడ్ రోనాల్డ్ కోల్మాన్‌లాగ, సింహకిశోరంలాగ బలిష్ఠంగా పసందుగా వున్న దేహాలు కలవాళ్ళని — ఒకళ్ళని చూపెడుదూ!

ఊహూఁ— పదిమైళ్ళ రేడియస్‌లో ఎక్కడా కనపడడు.

అన్నాడు, అనుకున్నాడు సుబ్బారావు. అయితే ఇటువంటి గాత్రం కలిగివున్నవాడికి ఉండవల్సిన ప్రోస్పెక్ట్స్ ఏఁవిటీ!

ఇలాగ ఒక గంట అయినా ఆలోచిస్తూ, నూతిలో సగం నీళ్ళు పోసేసుకుంటూవున్న సుబ్బారావుకి వాళ్ళ అమ్మ పిలుపుగాని, చెల్లెలు కేకగాని వినిపించే టప్పటికి తెలివివొచ్చి వొళ్ళు తుడుచుకుని తను అద్దెకున్న తన వాటాలోకి వెళతాడు. వాటాలో మొదట వంటగదిలోంచి రెండవ గదీ, అఖరు గదీ అయిన పడక గదిలోకి వెళ్ళాలి.

పడక గదినే చదువులగది అనవచ్చును. దాన్నే డ్రాయింగురూమ్ అన్నా సుబ్బారావుకి ఏమీ అభ్యంతరం లేదు.

మొదటిదైన వంటగది దాటుతూంటే వాళ్ళమ్మ "ఒరే సుబ్బా! మెంతులూ, ఆవాలూ అయిపోయాయిరా, స్కూల్‌నుంచి వొచ్చేటప్పుడు పట్టుకురా నాయనా" అంటుంది.

'ఓ అలాగే' అంటూ రెండవ గదిలోకి వెళతాడు. అక్కడ చెల్లెలు ఓమూలకూర్చుని బుద్ధిమంతురాలిగా సాంఘిక శాస్త్రం చదువుతూంటుంది.

సుబ్బారావు నవ్వుతాడు. ఎందుకంటే ఆ పుస్తకం పేజీలమధ్య సినిమా పాటలపుస్తకం కూడ ఉంటుందిగా. అయితే సుబ్బారావు తెలీనట్లుగా ఉంటాడు. డిప్లమసీ అంటారే, అదికూడా సుబ్బారావుకి తెలియక పోలేదు.

ఆ గదిలో ఓ బల్లవుంది. బల్లముందు ఓ కుర్చీవుంది. ఆ కుర్చీలో కూర్చుంటాడు సుబ్బారావు. బల్లమీద ఒక అద్దం గోడకి దాపెట్టి ఉంటుంది. అద్దంఅంటే అంతాకాదు; అసలు అద్దంలో మూడూపై అయిదవ వంతు. ఆ మధ్య అద్దం కిందపడినప్పుడు తక్కిన రెండూపై అయిదవ వంతు అసలునుంచి బలవద్వియోగం పొంది విడిపోయింది.

ఈ అద్దంలో చూచుకుంటూ సుబ్బారావు మళ్ళీ ఒక గంట ఆలోచించుకుంటాడు. అద్దంలో అతని మొహం మూడూపై అయిదవవంతు మొహం కనపడుతుంది ఆ పరిమాణంలో తనకళ్లూ, జుట్టూ, ముక్కూ, పెదాలూ, పెదాలమీద అందమైన సన్నని చిన్నని మీసకట్టూ చూచుకుంటాడు. అలాగ చూచుకుంటూ ఆలోచించుకుంటాడు.

ఏమనీ —— ?

అదిగో, అక్కడే అతని ఆలోచన తారాజువ్వలా దూసుకుపోతుంది. విచిత్రమైన గగనాల్ని తాకుతుంది. నక్షత్రాల్ని 'హలో' అని పలకరిస్తుంది. ఇంకా పైపైన ఏయే విచిత్ర స్వప్నగోళాలు ఉన్నాయో అని గవేషిస్తూ, పర్యవేక్షిస్తూ, వెళ్ళిపోతుంది పైపైకి.

తనకున్న పెర్సనాలిటీకి ఒక యూరోపియన్ కంపెనీ యజమాని కనీసం వెయ్యిరూపాయల జీతంమీద మాంచి ఉద్యోగం ఒకటి ఎందుకివ్వకూడదూ ? ఏం, ఎందుకు యివ్వకూడదూ. అసలు మొదట రాక్‌ఫెల్లర్ ఎవడు ? ఫోర్డు ఎవడు ?

బొంబాయిలోనూ, మద్రాసులోనూ, యిళ్ళకన్న స్టుడియోలు ఎక్కువై పోయాయిట. అందులోనూ కొత్త మొహాలకోసం ప్రొడ్యూ

సర్లూ, డైరెక్టర్లూ ఒకటే గోల పెడుతున్నారట. మరి తనకున్న కట్టూ గెటుటూతో (Cut and gait) చటుక్కున ఓ ఫాస్సతగిలి హీరో అయిపోతే—?

అసలు అంతదూరం వరకూ ఎందుకూ, మిల్లు ఓనర్ ప్రకాశరావు కూతురు – తమ స్కూలునుంచి వస్తుంటే కారు వయ్యారంగా డ్రైవ్ చేసుకుంటూ ఎదురు వస్తుందికదా. చలాకీగా అందంగా ఫ్యాషన్‌గా ఉంటుంది. ఎర్రని పెదవుల మీదకి రాబోయే నవ్వు దారితప్పి అలా బుగ్గలమీదికి వెళ్ళబోయి సరాసరి కళ్ళల్లోకివెళ్ళి కూర్చుంటుంది. బలే అందంగా ఉంటుంది. సుమిత్ర ! ఒకరోజున కార్లో వెళుతూ వెళుతూ తన్నిచూసి, నిదానంగా యింకోమారు చూసి, స్టన్‌అయి, ఉక్కిరి బిక్కిరై 'ఓహో ఎవరీ కుర్రవాడు. ఇతనికి నా హృదయం యిచ్చేశాను. ఇతనే నా మొగుడు. ఈ నిశ్చయమూ, నిర్ణయమూ మారదు' అని గట్టిగా అనేసుకుంటే – ఏమో ఎవరికి తెలుసూ !

ఇలాంటివన్నీ ఆలోచించుకుంటాడు. అందుకే అతనికి బొత్తిగా తీరిక ఉండదు.

ఒకటి : పరికిణీలు చిరిగిపోయాయి, కుట్టించరా అన్నయ్యా.

రెండు : రెండు వోణీలుకూడా కొనేం – మరచిపోకు.

మూడు : అన్నట్టు పాలవాడు సొమ్ముకోసం నిలతీస్తున్నాడురా అబ్బాయి. వాడికి చాలా అవసరమంట !

నాలుగు : ఏమండోయ్ సుబ్బారావుగారూ. మీరు అలాగ సంగీతం పాడేస్తూంటే మా పిల్లలు చదువుకోవాలా అక్కరలేదా–స్వంత యిల్లు అనుకున్నారేఁవిటీ.

అయిదు : ఒరేయ్ సుబ్బారావు. అడక్కడక్క అడిగావ్ పాపం. అయిదు రూపాయలు కాదుకదా. అర్ధరూపాయి కూడా లేదురా. నీతోడు.

ఆరు : సైకిల్‌కి లైటు లేదేం. నీ పేరు? పని? ఊరు? రేపు పదింటికి కోర్టుకి రా.

ఏడు : ఏయ్ హారన్ వాయిస్తూంటే తప్పుకోవాలని తెలియదూ. నడుస్తూనే నిద్రపోతున్నావా.

ఎనిమిది: చిరంజీవి సుబ్బారావుకి ; ఈ నెల జీతాలు మాకు అందలేదు. మీ అత్తయ్యకి వారం రోజుల్నుంచి జ్వరం. ఒక్క యిరవై రూపాయలుంటే అర్జంటుగా పంపించవల్సింది జరూరు.

తొమ్మిది: ఈ షర్టింగు గజం అయిదు రూపాయలు. ఏం అలా చూస్తారేం. బట్టలన్నీ తీయించి కుప్ప వేయించారు. కొనే మొహమో కాదో తెలుస్తూనే ఉంది.

పది : ఏమోయ్ సుబ్బారావ్. స్కూలు వదలగానే ఒకసారి యింటికి రా. రేపు మా యింట్లో సత్యనారాయణవ్రతం చేసుకుంటున్నాం. కొంచెం మార్కెటింగ్ చేసి పెడుదువుగాని నీకు సరుకునాణెం తెలిసినట్టు యింకెవరికీ తెలియదంటుంది మా ఆవిడ–ఇది కుర్చీలో కూర్చున్న హెడ్మాష్టర్ అధిధగల ఒక స్థూలకాయం తాలూకు ఆస్యవివరంనుంచి వచ్చిన ఆజ్ఞ!

ఇలాంటివి గొప్పలు, ముళ్ళు, డొంకలు, రాళ్ళు, గాజు పెంకులు, గోతులు, తేలుకాట్లు, మంద్రగబ్బలు అడుగడుగునా మలుపు మలుపునా తగులుతున్నా సుబ్బారావు నిస్పృహ చెందలేదు.

ఎప్పుడైనా ఖిన్నుడౌతాడు. గుండె బరువెక్కి ఓ నిముషం చీకట్లనీ శ్మశానాల్నీ తలచుకుంటాడు. కాని అంతా ఓ నిముషం మాత్రమే. మరు నిముషంలో ఆప్టిమిస్టు సుబ్బారావు–ఉత్సాహవంతుడు సుబ్బారావు హుషారుగా ఆలోచించుకుంటాడు.

దెబ్బమీద దెబ్బ తగిలిన కొద్దీ ఆలోచన మరీ మధురంగా రమ్యంగా అలంకరించుకుని వస్తుంది.

ఆశ గబుక్కున చావదు.

అందులో యౌవనంలో కగ్గను కూడా కగ్గదు.

ప్రాణశక్తి ఎలాగో అలాగా బతకడానికి ప్రయత్నిస్తుంది. బతకడానికి అవసరమైన ఆనందంకోసం వెదుకుతుంది. ఆశ అనే చేయిని ఊతగా తీసుకుంటుంది.

ఆశ ఆలోచనల్ని రేపుతుంది. కలల్ని జల్లుతుంది.

అందుకే సుబ్బారావుకి ఆలోచించడానికి యీ కాలం సరిపోవడం లేదు. ఆలోచించిన కొలదీ అతనికి రెట్టింపు బలం వస్తుంది. ఆనందం కలుగుతుంది.

ఈ ఆనందం మిథ్యా, నిజమా ?

వేదాంతం అంటే యిష్టంలేదు సుబ్బారావుకి.

అనుభవించినంతసేపూ యిది నిజమే.

తాగి మైకంలో ఉన్నంతసేపూ అదీ ఒక ఆనందమే !

అందుకే ఆలోచనల మద్యాన్ని, మైరేయాన్ని, కల్లుని, బ్రాందీని, వైన్ని, విస్కీని అన్ని రకాలనీ అవిచ్ఛిన్నంగా తాగేస్తున్న సుబ్బారావుకి—

ఆ రోజు సాయంత్రం కల నిజమయేటంత అపాయం జరిగింది.

పిల్లలకి సెన్సుపాఠం చెప్పి లాంగ్‌బెల్ కొట్టగానే స్కూల్ దుమ్మని దులిపేసుకుంటూ గబగబా వస్తూన్న సుబ్బారావుని

కారు ఢీకొట్టింది. కొంచెం జాగ్రత్తగానే.

ఆ కారు కింక వేరేమార్గంలేదు. ఎందుకంటే సుబ్బారావుని ఆ మాత్రం ఢీకొట్టక పోతే—ఎదురుగా వచ్చే పొగరుమోతులారీ కారుని పచ్చడిచేసి ఉండును.

కనురెప్పపాటులో సుబ్బారావు నేలమీద సాష్టాంగపడి ఓ అర గజం దూరం జర్రుమని జారాడు.

దుమ్ములోంచి నొసటిమీద ఎర్రని నేత్రాన్ని కాళ్ళకీ చేతులకీ అరుణకంకణాల్నీ, దేహానికి బూడిదనీ ధరించిన అపర శివుణ్ణి రోడ్డు మీద పోయే యిద్దరు ప్రమథులు లేవనెత్తారు.

'ఎక్స్క్యూజ్ మి'- సన్నని వీణాస్వరం.

కళ్ళమీద ఉన్న కంకరదుమ్ము పల్చని పొరలోంచి సుమిత్ర అస్పష్టరూపం.

"వెరీ వెరీ సారీ." అదే, ఆ వీణాస్వరమే.

"....................."

"కారులో ఎక్కండీ ప్లీజ్"

కారు ఓ అందమైన భవనం ముందు ఆగింది. సుమిత్ర అతన్ని చెయ్యిపట్టుకుని మెల్లగా లోపలికి నడిపించింది.

అసలే షాక్ తగిలిన సుబ్బారావుకి సుమిత్ర సన్నిహిత రూపమూ, స్పర్శా మరో షాక్‌లా తగిలాయి. ఇది నిజమా! లేకపోతే తను చచ్చిపోయి స్వర్గానికి వెళ్ళగా; తనకి సుమిత్ర అంటే యిష్టమని తెలిసిన ఊర్వశో, తిలోత్తమో కామరూపులు కాబట్టి సుమిత్ర రూపంతో వచ్చారా?

అయొడిన్ చురుక్కుమనేటప్పటికి అతనికి తెలివి వచ్చింది. కళ్ళు తెరచి కలయచూశాడు. సుమిత్ర, సుమిత్ర తల్లీ తండ్రీ, గుమాస్తాలూ నౌకర్లూ వగైరా వగైరాలు.

"ఎలావుంది మీకు" అంది సుమిత్ర.

జుట్టునీ వొంటినీ అంటుకున్న దుమ్ము దులిపేసుకొన్నాడు గబా గబా సుబ్బారావు. సిగ్గుపడిపోయాడు సుబ్బారావు. తనేదో తప్పుచేసినట్టు "క్షమించండి" అన్నాడు సుబ్బారావు.

"ఏం పని చేస్తున్నావబ్బాయీ" అన్నాడు దశలక్షాధికారీ, మిల్ ఓనరూ అయిన తండ్రి.

"ఫలానా స్కూల్లో టీచరునండి"

"బాగుంది నాయనా, ఏ క్లాస్ హోల్డు చేస్తున్నావు."

"ఫస్టుఫారం."

సుమిత్ర జాలిగా చూసింది. "నాన్నా, వీరికి తీరుబడివుంటే మన గోపీకి ట్యూషన్ చెప్తారేమో" అంది.

వాళ్ళిస్తానన్న జీతానికి, వాళ్ళు రమ్మన్న టైమ్కి, వాళ్ళవాళ్ళ టెంపర్కి అన్నిటికీ వొప్పేసుకున్నాడు సుబ్బారావు సుమిత్ర కేసి చూస్తూ. ఒక్క గంతులో అతనికి ఆకాశం అంత ఎత్తు ఎగిరినట్లయింది.

ఒక్క అంగలో వీధిలోకి వచ్చి, అక్కడున్న కారుకి కృతజ్ఞతతో మనస్సులోనే నమస్కరించి ఒక్కడూ ఆలోచించుకుంటూ వెళ్ళిపోయాడు.

జీవితంలో ఒక అందమైన అమ్మాయినీ, ఆమె లక్ష్మీన్నీ ఒకేసారి పొందకలిగే అదృష్టం తాను కలిగివున్నాడా? ఇటువంటి దైవ నిర్ణయం ఏదో లేకపోతే తాను సుమిత్ర కారువల్లనే ఎందుకు దెబ్బ తినాలి? ఓహో దేవుడెంత మంచివాడు. ఎంత దూరం ఆలోచిస్తాడు పాపం? బల్లమీద అద్దంలోని తన మూడూ బై అయిదవ వంతు ప్రతిబింబం అవును అంది. ఆ ప్రతిబింబాన్ని తానెప్పుడూ నమ్మాడు. ఆ నమ్మకం వృథాపోదు.

"సుమిత్ర! చూడడంలో మాట్లాడడంలో ఒక ఆరర్ద్రభావం లేదా? ఆమె హృదయం ధ్వనించలేదా?" అని అడిగింది ఆ ప్రతిబింబం.

తర్వాత రోజున ట్యూషన్ చెప్పడానికి వెళ్ళాడు సుబ్బారావు అతనికున్న బట్టలలో మంచివీ అందమైనవీ వేసుకుని. సుమిత్ర నవ్వుతూ ఎదురు వచ్చింది.

"నమస్కారం. నయంగా ఉందా మేష్టారూ" అంది

"నయమేలెండి. అంత పెద్ద దెబ్బలేంకాదుగా" అన్నాడు తల వంచుకుని సుబ్బారావు.

"మొదట ఎంతో భయపడిపోయాను ఏదో పెద్ద ప్రమాదం జరిగి ఉంటుందని. థాంక్‌గాడ్, ఏదో సవ్యంగా తేలిపోయింది."

"కారు ; పక్కనుంచి డాష్ యిచ్చింది. అదీకాక కారు అంత వేగంగా రావడం లేదులెండి."

"పోనిద్దురూ. ఈ ఏక్సిడెంట్‌వల్ల గోపీకి మంచి మేష్టారు వచ్చారు. అన్నట్టు మా గోపీ చెప్పాడు మీరు బాగా పాడతారనీ."

"ఏదోలెండి-గాలిపాట" సిగ్గుపడ్డాడు సుబ్బారావు.

"ఎప్పుడో మీ పాట వినాలి. వస్తానండి నమస్తే" అంటూ హేండ్‌బాగ్ వూపుకుంటూ వయ్యారంగా నడచి వెళ్ళిపోయింది సుమిత్ర.

ఆమె మాట్లాడుతూన్నంతసేపు సరిగ్గా తల ఎత్తలేని తన లజ్జా స్వభావానికి చాలా చిరాకుపడిపోయాడు సుబ్బారావు. కాని ఆమె ఎంత సరదాగా హాయిగా మాట్లాడింది; రోజూ యిలాగే తనతో మాట్లాడితే బాపుండును.

"లెక్కలు చెప్తారా మేష్టారూ ;" అని గోపీ అనేటంతవరకూ అతను అన్యమనస్కుడయే ఉన్నాడు. "లాభము - నష్టము" అన్న గణితబోధినిలోని అధ్యాయాన్ని చూసి యీ మనస్థితిలో ఆ పాఠం చెప్పడంకన్న రసాభాసము వేరే ఉండదనుకున్నాడు.

ట్యూషన్ ప్రారంభించి ఒకవారం రోజులయింది.

ఈ వారంరోజులూ సుమిత్ర రూపంకాని, వాక్కుకాని, అడుగు సవ్వడికాని కనపడలేదు. వినపడలేదు సుబ్బారావుకి.

నిరాశ మెల్ల మెల్లగా నల్లనల్లగా ఆవరిస్తోంది సుబ్బారావుని. నీరసం వస్తోంది.

అతనిమీద అతనికిగల విశ్వాసం సన్నగిల్లి వేసవికాలపు ఏటి పాయలాగ భయపడి సిగ్గుపడి ఏడుపులాంటి యిసుక నేలమీద యింకి పోతోంది.

అద్దంలో అతని 3/5 వ ప్రతిబింబం హెచ్చరించడం మాని వేసింది

ఇటువంటి విపత్ సమయంలో - ట్యూషన్ చెప్పి వీధిగేటుదాకా అడుగులు వేసిన సుబ్బారావుని —

"మేష్టారూ అక్కయ్య మిమ్మల్ని పిలుస్తోంది" అన్నాడు గోపి. గోపి ఆ సమయంలో మురళి వాయిస్తూన్న బాలకృష్ణుడిలాగా కనిపించాడు సుబ్బారావుకి - ఎదురుగా ఆశగా గోపీ వెనకాలనే హాలుదాటి ఏవేవో గదులుదాటి ఓ గదిలోకి వెళ్ళాడు.

ఒక పెద్దగదిలో విరుగుడు చేవకర్రతో చేసిన సొగసైన మంచం మీద మెత్తని వెల్వెట్ దిండ్ల నానుకుని వడిలీవడలని పువ్వులా పడుకుంది సుమిత్ర.

కిటికీలకి తెరలువాల్చి ఉన్నాయి. గోడలలోనే అమర్చబడిన విద్యుద్దీపాలు నీరెండలాంటి కాంతిని గది అంతా ప్రసరిస్తున్నాయి.

"రాండి మేష్టారూ" అంది సుమిత్ర.

అలవాటులేని ఆ పరిసరాలకీ, స్నేహశీలమైన ఆమె ఆహ్వానానికీ తొట్రుపడుతూ ఆమె చూపించిన కుర్చీలో ఆమె మంచానికి అనతి దూరంలోనే కూర్చున్నాడు.

"నిన్నటినుంచి జ్వరంగా ఉంది. ఒక రైకీ ఏమీ తోచడంలేదు. పోనీ మీతో కబుర్లాడుతూంటే"-నవ్వింది సుమిత్ర.

"తప్పకుండానండి"

"మీకేమి పనిలేదుకదా ?"

"ఏం లేదండి. ఈ ఒక్క ట్యూషనే నాకు వున్నది"

"అయితే యింక చిక్కేలేదు."

ఈ రోజున చెల్లెల్నీ తల్లినీ సినిమాకి తీసుకువెళతాను. రెడీగా వుండమన్నాడు సుబ్బారావు. వాళ్లు కనిపెట్టుకుంటారన్న బాధని గట్టిగా నొక్కిపట్టి నోరెత్తకుండా చేశాడు

వాళ్ళ కబుర్లు సుబ్బారావు స్కూలునీ, లేడెస్టు పిక్చరునీ, సుమిత్ర కాలేజీని, స్టోర్సునీ, రాజకీయాల్ని ఒక్కొక్కటే దాటి చివరకు సంగీతం దగ్గరకు వచ్చాయి. సంగీతదర్శకులనీ. పాడేవాళ్ళనీ అందరినీ తిటేసి చాలామటుకు ఇద్దరూ చాలా విషయాలలో ఏకాభిప్రాయం కలిగివున్నట్లు తెలిసికొన్నారు.

"మీరేమైనా పాడండి మేస్టారూ."

సిగ్గుపడ్డాడు సుబ్బారావు. పాడాలి తప్పదంది సుమిత్ర. సుబ్బారావు పాడాడు. నిజంగా బాగా పాడాడు. సుమిత్ర నిట్టూర్చింది..

"అదేం ?" అన్నాడు సుబ్బారావు.

"మీ పాట నన్ను కదిలించేసింది."

భారతరత్న బిరుదు ఈ మెప్పుముందు ఏపాటిది ! ఎనిమిది గంటలకు వెళతానని లేచాడు సుబ్బారావు. సుమిత్ర కృతజ్ఞతతో "థాంక్స్ ! మీ స్నేహం కలగడం నా అదృష్టం" అంది.

తాగి మైకంతో ఉన్నవాడిలా ఇంటికి వెళ్ళాడు. తల్లికి, చెల్లెలికి ఏదో సాకు చెప్పాడు. టేబిలుమీది అద్దంలో తన ప్రతిబింబాన్ని అదే పనిగా చూసుకున్నాడు. ఎప్పుడూ లేని కాంతి ఆ కళ్ళల్లో ! ఎప్పుడూ లేని అందం ఆ మొహంలో !

భోంచేశాక చెల్లెలు "అబ్బ, గోంగూరపచ్చడిలో కారం ఎక్కువయింది బాబో" అంది.

"గోంగూరపచ్చడేమిటి ?" అని విసుగ్గా అడిగాడు సుబ్బారావు.

"నువ్వు తినలేదూ ?" అని అడిగింది చెల్లెలు.

"ఎప్పుడు ?"

"ఇప్పుడే"

"ఎక్కడ ?"

"ఇక్కడే అదేమిటన్నయ్యా అలా మాట్లాడుతావ్ ? ఇప్పుడన్నంలో కలుపుకుని తినికూడా....?"

సుబ్బారావు కాబోలనుకున్నాడు. అతని ఉదాత్త మనస్థితిలో పప్పు గోంగూరపచ్చడివంటి విషయాలకి తావులేదు.

అతనికి కలతనిద్ర పట్టింది. నిద్రలో సుమిత్ర కనబడింది. మెత్తని తెల్లని వొంపులు తిరిగిన ఆమె వొళ్ళూ, వొంటిమీద కొంచెం నలిగిన తెల్లని వాయిల్ చీరా, సంస్కరింపబడని ఆమె జుట్టు చిందరవందరగా ఆమె నున్నని మెడమీదా – బుగ్గలమీదా జ్వరంవేడికి మరి కాస్త ఎరుపెక్కిన చిన్ని పెదవుల కదలికా – ఈ అప్రయత్న అలంకృతమైన ఆమె రూపంలోని సహజ సౌందర్యం అతని మనస్సుని వెయ్యి అత్తరు సీసాలు పగలగొట్టినంత సౌరభంతో ముంచెత్తి ఉక్కిరిబిక్కిరిచేసింది.

తర్వాతరోజున ట్యూషను ఇంకా చెబుతూండగానే లోపలినుండి సుమిత్ర "నమస్తే మేష్టారూ" అంటూ వచ్చింది.

"నమస్తే నమస్తే" అంటూ లేచి నిలబడ్డాడు సుబ్బారావు. "మీ వంట్లో ఎలా వుంది ?"

"ఈ రోజున నయమే. చారూ అన్నం తిన్నాను. అలా షికారు పోదాం రండి. మీ కంపెనీ వుంటే–"

"ఇంకా ట్యూషన్...." నసిగాడు సుబ్బారావు.

"ఫర్వాలేదులెండి.... ఒవేయి గోపి. హాయి ఆడుకో."

కారు తిన్నగా నదిఒడ్డుకి వెళ్ళి ఆగింది. ఇదరూ దిగారు. అంతా నిర్జనంగా వుంది. ఇసుక ఉన్న స్థలం చూసి ఇద్దరూ కూర్చున్నారు ఇటూ అటూ తోటలు, తోటగట్టునే వరుసల్లో వందలకొద్దీ తాటిచెట్లు. తాటితోపు వెనుక ఆకాశంమీద ఎర్రని కుంకుమ, నదిమీది నుంచి అలలు అలలుగా చల్లని గాలి, గాలికి కదలుతున్న ఆమె ముంగురులు, ఆమె షిఫాన్‌చీర పైట. పైట అంచు అలా అలా కదలి అతని కాళ్ళనీ, మొహాన్నీ తగలడం –

వాళ్ళ మాటలు ఎక్కడి నుంచి ఎక్కడికి వెడుతున్నాయో తెలియకుండానే, చటుక్కున ఆమె ఇలా అడిగింది. "మీరింకా పెళ్ళిచేసుకోలేదేం ?"

"నన్నెవరు చేసుకుంటారు ?" – గొప్ప డిప్లమసీ ఉపయోగించి అన్నాడు సుబ్బారావు యీ మాట. ఇలాగ అన్నందుకు తన తెలివికి తానే ఆశ్చర్యపోయాడు. ఇప్పుడు సుమిత్ర ఏం జవాబు చెపుతుంది ? ఆ జవాబులో తన భవిష్యత్తు గర్భితమై వుంటుంది.

"ఎవరయినా చేసుకుంటారు. మీకేం, దొరలా ఉన్నారు" అంది సుమిత్ర నవ్వుతూనే సీరియస్‌గా.

సుబ్బారావుగుండె గబగబకొట్టుకుంది – ఆనందం వలన; ఆ జవాబులో సూచింపబడిన అర్థం వలన; చటుక్కున ఆమె మృదుహస్తాన్ని చేతిలోకి తీసుకుని ముద్దెట్టుకోవాలనుకున్నాడు. కాని అప్పుడే కాదు. ఇప్పటికి రెండవమెట్టు ఎక్కాడు. మొదటిమెట్టు వాళ్ళింట్లో ట్యూషన్ కుదరడం !

రోజులు గడుస్తున్నాయి. రోజూ కాకపోయినా రెండు మూడు రోజుల కొకసారైనా ఇద్దరూ షికారు వెళ్ళుతున్నారు. సినీమాలకి వెళ్ళ

తున్నారు. పరిచయం గాఢతరమౌతోంది. డ్రైవ్ చేస్తోన్న సుమిత్ర, కబుర్లు చెప్పే సుమిత్ర, పచ్చికమీద చేతులు తలగడగా పెట్టుకుని ఆకాశం లోకి చూస్తూ పరున్న సుమిత్ర, చిరుకోపం నటించే సుమిత్ర - ఇన్ని రకాల రూపాలు, వ్యక్తిత్వాలు, అందాలు సవరించుకుని సుమిత్ర అతని మనస్సునీ, కళ్ళనీ, గుండెనీ ఆక్రమించివేసింది.

సుబ్బారావు ఇంటి పనులు చూడడమే మానివేశాడు. తల్లికి దగ్గు వస్తే మందు తీసుకురాడు. చెల్లెలికి రిబ్బనుముక్క కూడ కొనడు. వంట చెరుకు అయిపోయిందని వరుసగా మూడురోజులు చెప్పి నాలుగవ రోజున తల్లి ఏడుస్తే అప్పుడు తిసుకువచ్చాడు. ఎందుకంటే అతనికి తీరుబడిలేదు. ఈ కాలం సరిపోవడమూ లేదు. సుమిత్రని గురించి ఆలోచించుకోవాలి కదా. కలలు కనాలి కదా. తర్వాత ఆమె యింటికి వెళ్ళేందుకు డ్రెస్సు వేసుకోవాలికదా. నెలజీతం పెట్టి మాంచి పాంట్లూ, బ్లౌజులూ, స్నో, పౌడరు, బ్రిల్ క్రీమ్, సెంట్లూ కొనేశాడు కదా. ఇవన్నీ వొంటికి రాసుకోవాలి, తయారవాలి. అప్పుడు సుమిత్ర దగ్గరకు వెళ్ళాలి. మరి యింటిపనులు చూసేందుకు తిరిక ఏది! తీరిక ఉన్నా డబ్బేదీ? తాను మాత్రం ఏం చెయ్యగలడు పాపం!

"ఏరా సుబ్బా, జీతం అంతా అలా తగలేస్తే నెల ఎలా గడుస్తుందిరా?" అంది తల్లి. మాట్లాడలేదు సుబ్బారావ్.

"మమ్మల్ని బ్రతికుండమన్నావా, పనులుండి చావమన్నావా?" నాలుగు రోజులు పోయాక అడిగింది తల్లి. వినిపించుకోలేదు సుబ్బారావు.

"నా ప్రారబ్ధం నాయనా. ఇంకా ఎన్నాళ్ళు చుట్టుపక్కలవాళ్ళ దగ్గర అప్పులు చెయ్యను? ఇంక నేను నుయ్యో గొయ్యో చూచుకుంటాను. నా కర్మ, నా కర్మ" తలబాదుకుని ఏడుస్తోంది పది రోజులు పోయాక తల్లి.

"నీ పాపన్నూ, నీ సుఖమే ఎప్పుడూనూ. నేనూ ఎక్కడేనా దాసి పిల్లకింద చేరి అంట్లుతోముకుని బతుకుతానులే అన్నయ్యా" కన్నీళ్ళు వరదలై పారాయి చిన్నారి చెల్లెలు లేత బుగ్గలమీద....

"ఏమయ్యా యిన్నేళ్ళొచ్చాయి బుద్ధి ఉండొద్దూ, తల్లినిలా ఉసురుపెడుతున్నావ్" అంది మజ్జిగపోసే మనిషి.

ఏడుపొచ్చింది సుబ్బారావుకి. తల్లి కాళ్ళు పట్టుకున్నాడు బతిమాలాడు. తనకీ సుమిత్రకీ గల పరిచయాన్ని గురించి చెప్పుకున్నాడు. "సుమిత్ర నన్ను తప్పక పెళ్ళి చేసుకుంటుందమ్మా, ఇంక మనకి కష్టాలు ఉండవ్" అని చెప్పాడు సుబ్బారావు.

"అయ్యో వెర్రినాయనా ఆమె కోటీశ్వరురాలి బిడ్డరా నాయనా. నక్కెక్కడ? నాగలోకం ఎక్కడరా సుబ్బా" అని కొడుకు అమాయకత్వానికి జాలిపడింది. ఈసారి సుబ్బారావు మళ్ళీ చెప్పాడు ఈకాలంలో ప్రేమకి ఇచ్చే విలువ, ప్రేమించిన వాళ్ళని తప్ప పెళ్ళిచేసుకోని భారతీయ తరుణీమణుల మనోవికాసమూ, సుమిత్రతో తన కారు షికార్లూ, నదీ సైకత విహారాలూ...."అమ్మా ఆమె పడక గదిలోకి కూడా నేను నిరాఘాటంగా వెళ్ళిపోతానమ్మా. ఇంకేం చెప్పమన్నావు? నమ్మ నా మాట నమ్మ" అన్నాడు.

తల్లికి నమ్మక తప్పలేదు. కళ్ళు పెద్దవిచేసుకుని వింది. ఆధునిక యువతుల స్వేచ్ఛని గురించి విన్నదేకాని తన కుమారుని ప్రేమించేటంత పరిణామానికి వచ్చిందన్న సంగతి గుర్తించలేకపోయింది. మొన్నటివరకూ ఈ కాలపు పిల్లలు పాడైపోతున్నారన్న నిర్ణయాన్ని ఆమె సడన్‌గా మార్చివేసుకుంది. తృప్తిగా నవ్వుతూ ఆనందం కళకళలాడే మొహంతో తల్లి కొడుకును అస్పష్టంగా ఆశీర్వదించింది. పక్కనే వింటోన్న చెల్లెలు కళ్ళల్లో ఆశ, మెరుపు, హాయి – ఝులం ఝులించాయి.

తల్లిలేచి లోపలికివెళ్ళి తిరిగివచ్చి కొడుకు చేతిలో ఒక బంగారు కాసుపెట్టి యిలాగ అంది : "నాయనా, ఇంటికంతటికీ ఇదే బంగారం. చెల్లెలికి శ్రావణానికి లోలకులు చేయించాలని ఉంచాను. ఇది ఎక్కడేనా

తాకట్టుపెట్టే కావల్సిన సరుకులు తీసుకురా, మళ్ళీ విడిపించుకుందాం — దేవుడి దయవుంటే."

"దేవుడిదయ ఉంటే అన్నయ్య పెళ్ళేనా?" అంది తెలివైన చెల్లెలు. తాకట్టు అంటే గుండెలో కలుక్కుమన్నా కాసుని జాగ్రత్తగా జేబులో పెట్టుకుని వెళ్ళిపోయాడు సుబ్బారావు

ఆ రోజున ఉదయమే సుమిత్ర ఆదేశానుసారంగా సుమిత్ర యింటికి వెళ్ళాడు. ఆమె నవ్వుతూ గేటుదగ్గరే ఎదురొచ్చింది. ఆమె విదేశీయమైన స్లాక్ తొడిగి పైన అందమైన బనీను వేసింది. జుట్టుని వెనకాల ముడివేసి కొనలు బుజాలమీద కుచ్చులా పడేటట్లు చేసింది. ఆ దుస్తులలో ఆమె అవయవాల సౌంకం స్ఫుటంగా, మరీ ఆకర్షణీయంగా వుంది. ఆమె చేతిలో బాడ్మింటన్ బాట్ వుంది.

సుబ్బారావు రెప్పలల్లార్చకుండా ఆమెని చూశాడు.

"ఏం ఈ డ్రెస్ బావులేదా?" నవ్వుతూ అడిగింది. సుమిత్ర.

"చాలా బావుంది. మీరు అప్సరసలా ఉన్నారు."

"ఊర్వశినా తిలోత్తమనా?" కిలకిల నవ్వింది. "రండి ఒక గేమ్ వేసుకుందాం."

బాడ్మింటన్‌లో మంచి ఆటగాడయిన సుబ్బారావు మూడు గేములూ ఓడిపోయాడు. ఆమె అందాన్నీ అవయవాల్నీ తనివిదీరక చూసే అత నికి ఊలుబంతి కనపడనేలేదు.

"మీరు పరాగ్గాఆడారు. మీరు మంచి ప్లేయరనివిన్నాను. ఆడదాన్ని కదా అని పాపం దయతలచారు కదూ" చిరుకోపంతో అంది సుమిత్ర.

"నోనో — మీ రీ వేళ నిజంగా బాగా ఉన్నారు — అఁఆడారు" అన్నాడు. విరగబడి నవ్వింది. సుమిత్ర. ఆ నవ్వుకి — ఇదేమిటి ఈ తెల్లని పారిజాత పూలదండలు ఎవరో విసురుతున్నారని యిటూ అటూ చూశాడు సుబ్బారావు.

వారంరోజులు పోయాక అక్కడే ఆ బాదంచెట్టుకింద కూర్చుని వాళ్ళిద్దరూ మాట్లాడుకోవడం కనుక పాఠకుడు వినిపుంటే తెల్లబోతాడు. వాళ్ళ 'మీరు' అనుకోవడం మానివేశారు 'నువ్వు నువ్వు' అని చాలా సన్నిహితంగా చనువుగా మాట్లాడుకుంటున్నారు.

"నువ్వెవర్నీ ప్రేమించలేదా సుమిత్రా ?"

"ఉహుఁ."

"అయితే నువ్వు పెళ్ళాడవా ?"

"ఉహు - సన్యాసిగా ఉంటా."

"అబ్బ నిజం చెప్పదూ."

"నా మాటకేంగాని మరి నువ్వు ?"

"నేనా - నేను నేను...."

తడబడ్డాడు సుబ్బారావు.

"ఉఁ - చెప్పవోయి."

"ఒక దివ్యసుందరీమణిని ప్రేమించాను."

"ఎవరూ....?"

"పేరు చెప్పకూడదు."

"పోనీ, ఏ ఊరూ ?"

"ఈ ఊరే-"

"ఎక్కడుంది ఈ ఊళ్లో ?"

"ఎక్కడ - ఇక్కడే."

"ఇక్కడా-" తెల్లబోయి యిటూ అటూ చూసింది సుమిత్ర.

"ఇక్కడ" అంటూ గుండెలు చూపించాడు సుబ్బారావు.

"ఓస్, అంతేనా" అంటూ పకపక నవ్వింది సుమిత్ర.

సుబ్బారావు ఒక్కసారి తన హృదయం విప్పి ఆమె ముందు పెడదామనుకున్నాడు

"నువ్వు లేనిదే నేను బ్రతకలేను. నా ప్రతి అణువులో, ప్రతి ఊహలో నువ్వే! నువ్వే" అనేసి ఆమె పాదాలమీద పడిపోదామనుకున్నాడు. కాని సుమిత్ర చటుక్కునలేచి "ఇక పోదాం సుబ్బారావ్. ఆలస్యమైపోయింది" అంటూ విష్‌చేసి లోపలికి వెళ్ళిపోయింది.

ఆలస్యంగా స్కూలుకి వెళ్ళిన సుబ్బారావుని హెడ్మాష్టరు పిలిచాడు. ఆయన కళ్ళు కోపంతో ఎరుపెక్కాయి.

"మీ ప్రవర్తన ఏం బాగులేదు."

"...................."

"మీరు క్లాసులకి సరిగ్గా రావడంలేదు. పాఠాలు సరిగా చెప్పడం లేదు. మీమీద అన్నీ కంప్లెయింట్సే—"

"...................వంట్లో బాగుండలేదండి."

"నేనలాగ నమ్మను? ఎప్పుడూ ఆ కోటేశ్వరరావుగారింటిదగ్గరే ఉంటావట — పోనీ ఇక్కడ రిజైను ఇచ్చి అక్కడ ఉద్యోగం చెయ్యరాదూ."

"...................."

"చూడు ఈ నోట్సు నువ్వు చెప్పినదేనా?" అంటూ ఒకపుస్తకం పైకి తీశారు హెడ్మాష్టరు.

"అవునండి."

"గుండెకాయలో ధమనులూ సిరలూ ప్రేమలూ ఉండునట—ఇదేం సైన్సు!"

"...................."

"నువ్వు చెప్పినదేనా — ఏమిటి ! ప్రేమలుకూడా సైన్సేనా ?"

"..........."

"మనస్థిమితం లేదా ? మాట్లాడవేం ?"

"పాపం సుబ్బారావు. నిన్ను చూస్తే జాలివేస్తోంది. నువ్వేదో బాధపడుతూన్నట్టుంది. మనిషివి చూస్తే ఆరోగ్యంగానే వున్నావు. కానీ నీ మూలాన పిల్లల చదువు దెబ్బతింటోంది. పోనీ కొన్నాళ్ళు సెలవు పెట్టరాదూ ?"

"నేనూ అదే అనుకుంటున్నానండి."

"జీతంనష్టంమీద నీకు సెలవిస్తాను. కావాలా ?"

"కావాలండి."

"ఎన్నాళ్ళు ?"

సుబ్బారావు ఆలోచించాడు "ఒక నెల అండి."

"సరే. అప్లయ్‌చేసుకో. ఈ నెల్లాళ్ళు విశ్రాంతి తీసుకొని మందుపుచ్చుకో మనస్థిమితానికి."

"చిత్తం" అన్నాడు సుబ్బారావు మనసులో మాత్రం 'పోవయ్యా ఇక ముందు మన జాతకం నీకేం తెలుసును ?' అనుకున్నాడు. పరిశుద్ధమైన ప్రాణవాయువును ఒకసారి గుండెలనిండా పీల్చి ఉత్సాహంగా స్కూలు ఆవరణ దాటి ప్రపంచంమీద పడ్డాడు.

సెలవుపెట్టిన సుబ్బారావుకి వారం రోజులవరకూ సుమిత్ర కనుపించనేలేదు. ఆమె స్నేహితురాండ్రతో ఏవో ప్రోగ్రాములూ, పిక్నిక్‌లూ మొదలైనవి జరుపుకోవటంవలన ఆమె యింటిదగ్గర లేకుండాపోయింది. తర్వాత రోజున నాలుగు దాటాక వెళ్ళాడు సుబ్బారావు.

"మీ అక్కయ్య వుందా ?" అని అడిగాడు గోపీని.

"ఓ" అంటూ గోపి సుబ్బారావుని ఆమె గదిలోకి తీసుకెళ్ళాడు. ఆమె అక్కడలేదు. "కూర్చోండి, ఎక్కడుందో చూస్తాను" అంటూ గోపి పరుగుతీసాడు. సుబ్బారావుకి చాలా కోపంగా ఉంది. వారంరోజులు తనని ఇంత విరహవ్యథలో ముంచి చంపడానికి ఆమెకి అధికారం ఎవరిచ్చారు ? అడగాలి అనుకున్నాడు.

గది నానుకుని ఉన్న బాత్‌రూమ్ తలుపు తీసుకుని సుమిత్ర వచ్చింది తువ్వాలు చుట్టబెట్టుకుని, 'ఓ–సుబ్బారావ్' అంటూ ఆమె గది లోంచి బాత్‌రూమ్‌లోకి ఒక్కసారిగా పరుగెత్తి తలుపులు వేసుకుంది. నీటిబిందువులు ముత్యాల్లా వొంటిమీద, ముంగురుల చివరలా మెరుస్తూంటే, తెల్లని వొంటివొంపుల్ని దాచలేని తువ్వాలుతో గుండ్రని అందమైన పిక్కలతో అందానికి మోడరన్ ఎడిషన్‌లా జలసుందరిలా ఒక్క నిముషం మెరుపులా మెరసిన ఆమెరూపం అతన్ని మూర్ఛుణ్ణి చేసింది. అలాగే నోరావలించి ఉండిపోయాడు.

బాత్‌రూమ్ తలుపు సన్నగా తీసి 'ఆ మంచంమీద చీర యిలా యిస్తావా సుబ్బారావ్' అంటూ నవ్వుతూ సిగ్గుతో అడిగింది సుమిత్ర. గబుక్కున తెలివి తెచ్చుకున్న సుబ్బారావు 'సారీ – సారీ నేను హాల్లో వెయిట్ చేస్తా'నంటూ గదిలోంచి వెళ్ళిపోయాడు కంగారుగా.

తర్వాత కార్లో యిరువురూ బజారుకి వెళ్ళారు. సుమిత్ర షాపింగ్ చేసింది. ఖరీదైన చీరలు, పౌడర్లు, ఒక అందమైన నెక్లెసూకొంది. వాటి కన్నింటికీ ఖరీదు తానివ్వగలిగితే – అనుకున్నాడు సుబ్బారావు. ఒక్కగంటలో అయిదారు వందల రూపాయలు సులువుగా ఖర్చుపెట్టిన సుమిత్ర ధనాన్నిచూసి కొంచెం ఈర్ష్యపడ్డాడు సుబ్బారావు. అక్కణ్ణుంచి నదిఒడ్డుకు వెళ్ళారు. తాటిచెట్ల వెనుక సూర్యుడు తాగినవాడిలా ఎర్రగా ఉన్నాడు. తాటిచెట్ల పొడుగాటి నీడలు నదీజలాలమీద పడి కదలుతున్నాయి. సుమిత్ర ఈ వేళ ఏదో గంభీరంగా ఉంది.

'ఎల్లుండి నా పుట్టినరోజు సుబ్బారావ్. పంథొమ్మిది వెళ్ళిపోతాయి.' ఆమె అలా అంటూంటే ఆమె గొంతులో ఏదో బాధ

ఉన్నట్టు తోచింది సుబ్బారావుకి. ఆమె పుట్టిన రోజుకన్న పవిత్రమైన దినం పంచాంగంలో ఎక్కడా ఉండదని సుబ్బారావుకి తెలుసును. పవిత్ర మైన ఆ రోజున ఆమెనడిగి తన ప్రేమ విషయం తేల్చుకోవాలను కున్నాడు.

"తర్వాత రోజున నేనూ నాన్నా అమ్మా అందరం బెంగుళూరు వెళ్ళుతున్నాం"

"బెంగుళూరా!" తలమీద మోదినట్టయింది సుబ్బారావుకి.

"అవును"

"ఎందుకూ"

"మా మేనత్త అక్కడుంటోంది"

"అయితే యిప్పు డెందుకూ. బెంగుళూరు వేసవిలో వెళితే చల్లగా ఉంటుందిట"

"మా బావ వొచ్చాడుగా."

"ఎక్కడినుంచి"

"అమెరికానుంచి. టెక్నాలజీలో ఏదో పెద్ద పరీక్ష పాసయ్యాడు."

"అయితే మీరెందుకూ వెళ్ళడం"

"ఊరికినే-మా మేనత్త మరి మరీ రమ్మని వ్రాసింది."

"మి మావయ్య ఏం చేస్తుంటాడు"

"అక్కడ టెక్స్టయిల్ ఫ్యాక్టరీ యజమాని. చాలా పెద్ద వ్యాపా రస్తుడు." ఎలా ఉంటాడు మి బావ అని అడగాలని "ఎన్నాళ్ళుంటా రక్కడ" అన్నాడు సుబ్బారావు.

"అబ్బే పది పదిహేను రోజులు."

"అయితే నన్ను మర్చిపోతా వన్నమాట."

"ఛా! అదేవిటి సుబ్బారావ్. నిన్ను కలలో అయినా మర్చి పోతానా. నా ప్రాణ స్నేహితుడివి."

చాలు అనుకున్నాడు సుబ్బారావు. జన్మ ధన్యమయింది. ఇంత కన్న ఏ ఆడది నోరు విడిచి చెప్పగలదు అనుకున్నాడు.

తర్వాత రోజున సుబ్బారావు ఎక్కే గుమ్మమూ, దిగేగుమ్మమూ, సుమిత్రకి పుట్టిన రోజుకి ప్రెజెంటు యివ్వాలంటే డబ్బేదీ. అందుకే ఎరుగున్నవాళ్లా, ఎరిగీ ఎరగనివాళ్ళ యిళ్ళన్నీ తిరిగాడు. సాయంత్రానికి అయిదుంబావలా వచ్చింది. చొక్కా మాత్రం చెమటతో తడిసి ముద్ద అయింది.

తిన్నగా ఒక షాప్‌లోకి వెళ్ళాడు. చేతినున్న వాచితీసి యిచ్చి, పాతికరూపాయలు తెచ్చుకున్నాడు. తీసి యివ్వడమంటే అమ్మేశాడన్న మాట. తాకట్టు అయితే పదిహేనుకిమించి యివ్వనన్నాడు మరి షాహూకారు. ఎప్పుడో ఎనభై రూపాయలెట్టి కొన్న వాచీకి అంతకన్న ఇచ్చే వాడు ఈ పృథివిలో అంటే యీ వూళ్ళో-లేడన్న షాహుకారు మాటల్ని పరమ సత్యంగా తీసుకుని అమ్మేశాడు.

ఆ రాత్రి అంతా నిద్రలో దుస్స్వప్నాలూ సుస్వప్నాలూ రెండూ కలిసివచ్చి, విశ్రాంతి లేనివాణ్ణిగా చేశాయి. తను అమ్మినవాచీ గాలిలో ఎగిరి శూన్యంలోకి స్పుత్నిక్‌లా దూసుకు పోయినట్టూ, సుమిత్ర దెయ్యం అయి 'నువ్వే కావాలి నువ్వే కావాలి' అని పీక్కు తింటున్నట్టూ, తాను రైలుకింద తల పెట్టినట్టూ, సుమిత్ర జడలో తను పువ్వులు ముడుస్తూ న్నట్లూ, సుమిత్ర తనని నదివొడ్డున తాటిచెట్టు మాటున మసక మసక చీకట్లో ముద్దు పెట్టుకుంటున్నట్టూ ...

ఆ రోజు బాగా ఆలస్యంగా లేచాడు. వొళ్ళంతా బరువుగావుంది. మొహమైనా కడుక్కోకుండా అద్దంముందు కూర్చుని తన మూడూ బై అయిదవవంతు మొహాన్ని చూసుకున్నాడు. జుట్టు మొహంమీద పడు తోంది. కళ్ళల్లో నిద్ర తాలూకు చీకటిరొద యింకా ఉంది. కండలు తిరి

గిన ఛాతీ చేతులూ బలంగానే ఉన్నా జడంగా ఆ బల్లనానుకుని అంటుకుని పోయాయి. సుబ్బారావు ఆలోచించుకోవడం మొదలెట్టాడు.

తనలో ఎందుకీ అలసట !

అస్పష్టమైన భవిష్యత్తువలన.

ఆమె అంతకన్న తన యిష్టాన్నీ ప్రేమనీ ఎలా వ్యక్తం చేస్తుంది? ఎంత మిలియనీర్ కూతురైనా ఆడదికదా !

తాను చాలకాలం వెయిట్ చేశాడు. తమ ప్రేమ తీగలుసాగి, ఆకుతొడిగి పుష్పించడానికి సిద్ధంగా ఉంది.

కనుక యింక అడిగెయ్యాలి. ఈ పుట్టిన రోజున తేల్చేసుకోవాలి.

తర్వాత బెంగుళూరు కాదు బొంబాయికూడ వెళ్ళమను ! తాను అనుమతి యిచ్చేస్తాడు.

పెళ్ళయాక ఎలా ఉంటుంది. హనీమూన్ ఎక్కడ ఎక్కడ ! తను కార్లో తిరుగుతూంటే స్థూల శరీరరూప రాక్షసుడు అనగా హెడ్మాష్టరు పాపం ఏమయిపోతాడు....అలా అలా ఆలోచించుకుంటూ ఉండిపోయాడు సుబ్బారావు.

మేడ అంతా అందంగా అరేంజ చేయబడివుంది. ఆహూతులలో మొదటవచ్చిన సుబ్బారావునుచూసి 'మేష్టారు ముందొచ్చేశారే' అని నవ్వి ఫ్లవర్ వేజులలో పువ్వులు సర్దడంలాంటి చిన్న పనులు పురమాయించింది. నౌకర్లు పనిలేకపోయినా – లేకపోవడంవలననే – మరింత హడావుడిగా యిటూ అటూ తిరుగుతున్నారు. అతిథులొక్కొక్కరే రావడం, నమస్తేలూ, కరచాలనాలూ, తెచ్చికోలునవ్వులూ, గొప్పలూ, డంబాలూ, అత్తరు వాసనలూ–అంతా శ్రీమంతులు యిళ్ళల్లోలాగే ఉంది.

హఠాత్తుగా కోటీశ్వరరావుగారు సుమిత్రని పిలిచి "అమ్మాయి ! కిళ్ళీలు రాలేదు" అన్నాడు. సుమిత్ర కళ్ళల్లో ఎంతో భయం గోచరిం

చించి. చప్పున సుబ్బారావు దగ్గరకు వచ్చి సైకిలుమీద వెళ్ళి పోలయ్య కొట్లో కిళ్లీలు తీసుకురమ్మని బతిమాలింది. సుబ్బారావు హాల్లోంచి సైకిలు సీటుమీదికి ఒకేగంతులో దూకడంకూడా సర్కస్‌ఫీట్ లాంటిదని కొందరి గట్టి నమ్మకం.

కిళ్ళీలు తీసుకు వచ్చిన సుబ్బారావుకి ఏ బల్ల ముందూ సీటు ఖాళీ లేక పోయింది. సుమిత్ర హడావుడిగా ఆడ మగ స్నేహితులతో ఏవేవో కబుర్లు చెపుతూ అయిస్ క్రీమ్‌ని అందంగా తింటోంది సుబ్బారావు కొంచెంసేపు నిలబడి సిగ్గుతో అవమానంతో హాల్లోకివచ్చి నిలబడ్డాడు. కోపంతో అతని పెదవులు వణకుతున్నాయి. వెళ్ళిపోదాం అనుకున్నాడు. కాని "సుబ్బారావ్" అంటూ పరుగెత్తుకు వచ్చింది సుమిత్ర. "క్షమించు - తొందరలో నీ మాట మరచిపోయాను. ప్లీజ్, ఎక్స్క్యూజ్‌మి" అంటూ అతని చెయ్యి పట్టుకుని తీసుకువచ్చి తన కుర్చీపక్క మరోకుర్చీ వేయించి "నా క్లోజ్ ఫ్రెండ్ (ఆప్త మిత్రులు) సుబ్బారావ్" అని అందరికీ పరిచయం చేసింది. సగర్వంగా సహాసంగా నెపోలియన్ సైనిక వందనాన్ని పొందుతూన్నట్టుగా సుబ్బారావు నలుదిక్కులా చూశాడు.

ఛీ - ఎంత అపారం చేసుకున్నాడు సుమిత్ర అమృత హృదయాన్ని. ఎంత అల్పుడు తాను. ఎంత సంకుచిత మనస్సు గలవాడు; సుబ్బారావు సుబ్బారావునే క్షమించనని నిక్కచ్చిగా చెప్పేశాడు. అందరూ బహుమతులు ఇచ్చి వెళ్ళిపోయాక సుమిత్ర ఒంటరిగా ఉండగా చూసి తను తీసుకువచ్చిన ఉంగరం - ఆమె కిచ్చాడు.

"ఎంత మంచివాడవు సుబ్బారావు" అంది కృతజ్ఞతతో సుమిత్ర. "రా అలా బాదంచెట్టుకింద కూర్చుందాం కాస్సేపు."

ఆ వచ్చినవాళ్ళెవరో, ఎవరికెన్ని మేడలు లేక కార్లు లేక నగలు ఉన్నాయో. ఎవరి కొడుక్కెంత కట్నం వచ్చిందో, ఏ యే అమ్మాయిలకి పెళ్ళి అయిందో, కొందరి కెందుకవలేదో - ఇటువంటివన్నీ గబగబా ఉత్సాహంగా సుమిత్ర చెప్పేస్తోంది. సుబ్బారావుకి తను అడగాలన్న

విషయం ఎలా ప్రారంభించాలా అని అనుమానం, అంతకన్న ఏదో భయం- "నువ్వా సామాన్య మేష్టారువి" అంటుందేమోనన్న దిగులు....

"ఒక పాట పాడు సుబ్బారావ్, ఇందాకటి పార్టీకి తలనొప్పి వచ్చేసింది." అంది వెల్లకితలా పడుకుని అందాల యౌవనాంగి సుమిత్ర.

సందేహభారంతో బరువెక్కిన గుండెగల సుబ్బారావు "ఈవేళ పాడలేను సుమిత్రా" అన్నాడు.

"పోనీలే- నేను రేపు వెళ్ళిపోతున్నాగా" అంది బు 'గమొహం పెట్టి.

"నువ్వు వెళ్ళిపోతే నాకేం తోచదు." అన్నాడు సుబ్బారావు ధైర్యంచేసి.

"నిజంగా !"

"నా కంతా శూన్యంగా వుంటుంది." సుబ్బారావు గొంతు గాద్గదికమైంది.

"నీ మనస్సు నాకు తెలియదా ? నాకు మాత్రం ? నువ్వు స్తమానం జ్ఞాపకం వస్తూంటావు."

ఈ సమాధానం మళ్ళీ అతని గుండెని తేలికపరచింది.

"పాడు. సుబ్బారావు- ఒక్కపాట పాడుదూ."

ఏదో దీనంగా జాలిగా అడిగినట్లనిపించింది సుబ్బారావుకి. అతనిలో రాబోయే వియోగవేదన అంతా యిప్పుడే పెల్లుబికినట్టయింది. సహజంగా విషాదమధురమైన గొంతు వచ్చేసింది. ఆచీకటిలో అతని కంఠస్వరం రాలిపడుతూన్న తారల దుమ్ములాగా, బాదంచెట్టు ఆకుల మీద నుంచి జారిపడుతున్న చిరుగాలి ఏడుపులాగా హృదయాన్ని బాధగా సోకుతోంది. 'ఓ వసంతమా, నువ్వు దూరంగా వెళ్ళిపోతున్నావు.

నా మనస్సు వర్షాకాలపు దుఃఖపునీటితో నిండిపోయింది. ఇంకభయంకరమైన హేమంతం వస్తోంది. నేను ఆశలనే ఆకులని రాల్చుకుని మోడునై పోతున్నాను. నశించిపోతున్నాను' అని ఆ పాట అర్థం. ఆ పాట ఒక చెట్టు పాడిన పాట అని వేరే చెప్పనక్కర్లేదు.

ఆ చెట్టును తానే అనుకున్నాడు సుబ్బారావు. అనుకుంటూనే విలవిలలాడిపోయేడు.

పాట ఆపి మొహం పక్కకి తిప్పడంలో పోర్టికోలోని విద్యుద్దీపపు కాంతి అతనిమీద పడింది. అతని కళ్ళమ్మట అశ్రువులు జారడం సుమిత్ర చూసింది.

"అదేవిటి సుబ్బారావు. ఏడుస్తున్నావా, ఛ !" అంది సుమిత్ర.

సుబ్బారావుకి ఏదో అభిమానం ముంచుకొచ్చింది. ఏడవడంవలన తాను సుమిత్రకి లోకువై పోతాననుకున్నాడు. ఎప్పుడూ గంభీరుడూ ధీరుడూ అయిన నాయకుణ్ణి వరిస్తారు కదా అందమైన సుందరీమణులు. అందుకోసం పెద్ద అబద్ధం ఆడేశాడు.

"ఇది నాలో ఒక విషాదస్మృతిని రేపింది సుమిత్రా."

"ఏమిటదీ—"

నా మిత్రుడీ పాట పాడేవాడు. అతని దగ్గరే నేనిది నేర్చుకున్నాను. అతను తర్వాత పాపం— చచ్చిపోయాడు."

"అరెరె !" అంది సుమిత్ర "నీది ఎంత సున్నితమైన మనస్సు సుబ్బారావ్."

కాని సుబ్బారావు చాలా బాధపడ్డాడు. ఆమె సానుభూతిని తన మీద నుంచి తన స్నేహితుడిమీదికి షోకస్ చేశాడు. తెలివితక్కువవల్ల. ఈ పాట బెంగుళూరు వెళ్ళిపోయే ఆమెని గురించే అనీ, ఆ ముక్కలై పోతూన్న హృదయం అచ్చంగా తనదేనని చెప్పివుంటే- ఈ 'అయితే'

అన్న ప్రశ్న సుబ్బారావు చరిత్రలో సమాధానంలేని క్లిష్టసమస్య అయిపోయింది.

"నువ్వు బుల్‌బుల్ వాయిస్తూ పాడితే ఎంతో బావుంటుంది" అంది సుమిత్ర.

"నీకు బుల్ బుల్ యిష్టమా?"

"చాలా యిష్టం."

"అయితే ఒకటి కొంటాను."

"కాదు కాదు. ఇక్కడ మంచివి ఉండవు. బెంగుళూరు వెళ్ళగానే కొని నీ పేర పార్సెల్ చేసి పంపిస్తాను" నేను వచ్చేటప్పటికి బుల్ బుల్ మీద నువ్వు పాడాలి సుమా!"

"ఓ – తప్పకుండా" అన్నాడు సుబ్బారావు.

తర్వాత రోజున మఫ్లర్ మొహానికి చుట్టుకుని, ముంగురులు చిరిపిగా నొసట నాట్యం చేస్తూంటే, తెల్లని పలువరుస కన్పించేలా నవ్వుతూ గుడ్‌బై చెబుతూ, చేరుమాలు ఊపుతూ రైలులో కనుచూపు మేరదాకా వెళ్ళిపోయే సుమిత్రని చూసి చూసి బరువుగా నిట్టూర్చి అంత కన్నా బరువుగా అడుగులు వేసుకుంటూ వచ్చేశాడు సుబ్బారావు.

ప్రకృతీ ప్రజలూ అందరూ నిరానందంగా కనిపించారు సుబ్బారావుకి. అదే కాదు, అతని మనస్సు ఓలఘాయిత్యంతో నిండిపోయింది.

"చూశావా సుబ్బారావు. ఈ 'లాంబ్రెటా' మోటార్ సైకిల్ మొన్ననే కొన్నాను. ఎలా వుంది?" అన్నాడొక క్లాస్‌మేటూ ధనికుడూ అయిన మిత్రుడు.

'తప్పకుండా ఏక్సిడెంట్ అయి చచ్చిపోతావు' అందామనుకున్నాడు కాని పేలవంగా నవ్వి "బాగుంది" అన్నాడు.

"సుబ్బా, నీ కోసం కష్టపడి పెట్టానురా వడియాలు" అంది తల్లి.

"తీసుకెళ్ళి గోదావరిలో పడెయ్యి" అన్నాడు విసురుగా సుబ్బారావు. తల్లి విస్తుపోయింది.

"అన్నయ్యా, పువ్వులజడ అల్లుకున్నాను చూడు" అని జడని ముందుకు వేసుకుని గర్వంగా చూపించింది చెల్లెలు.

"చదువు సంధ్యా లేదుకాని పువ్వుల జడలు! ఊరికే యింతింత జుట్టు పెంచుకోవడమూ. వాటికి అత్తర్లూ, పువ్వులూ - నీకు క్రాపింగ్ చేయించి పారేస్తానుండు" అని విసురుగా వెళ్ళిపోయాడు.

"సుమిత్ర ఊళ్ళో లేనిదే యింత విప్లవం కలుగుతుందని ఎవరు అనుకుంటారు? ఆహారం రుచించక, ఏకాంతం పడక, నలుగురిలో తోచక, రాత్రిళ్ళు నిద్రపట్టక, పగలు ఎప్పటికీ రాత్రి అవక - చిక్కిపోతున్నాడు సుబ్బారావు. అయిదవరోజున సుబ్బారావుకి పార్సెల్ వచ్చింది. అతని మొహం కళకళలాడింది. రోజూ నదివొడ్డుకి పోయి అదేచోటులో కూర్చుని బుల్ బుల్ సారించేవాడు. పాటపాడేవాడు. తాటితోపు తల ఊపేది. నదిలో నీళ్ళు ఆనందంతో జల జలమని చప్పుడు చేసేవి.

సుబ్బారావు ప్రేమికుడు. ఇది ప్రేమ తపస్సు.

"ఏరా, అడిగావా ఆ అమ్మాయిని పెళ్ళిమాట?" అన్నది తల్లి ఒకరోజున. ఏమిటో మధ్యమధ్య ఆమెకి అనుమానం ఎక్కువైపోతూంటుంది. ఒక నెల్లాళ్ళు సెలవుపెట్టాడు కొడుకు. తాకట్టుమీద తెచ్చిన డబ్బు అయిపోవచ్చింది. ఎండమావుల్ని నమ్ముకుని ఎన్నాళ్ళు బతకడం- ఇదే ఆమె సందేహం.

కాని ఆమె 'బుల్ బుల్' పంపడమూ, ఆమె ఉత్తరంలో 'మా మేనత్తతోనూ, బావతోనూ నీ మాటే చెబుతూంటాను' అని వ్రాయడమూ - ఇది తిరిగీ ఆమెకి ఆశనీ ధైర్యాన్నీ కలిగించాయి. ఆ ఏడు కొండలవాడే తలచుకుంటే ఓడలు బళ్ళూ బళ్ళు ఓడలూ అయిపోవా.

అలాగ పాడుకుంటూ, ఆలోచించుకుంటూ రోజులు గడుపు తున్నాడు సుబ్బారావు.

కాని కాలం సరిపోయేది కాదు సుబ్బారావు ఆలోచించుకోడానికి. కాలం యిరుకుగా పాత కలకత్తా గల్లీలాగ వుంది. పాపం ఎన్ని ఆలోచించుకోవాలి తాను. సుమిత్రతో తానింతవరకు గడిపిన ప్రతి క్షణమూ జ్ఞప్తికి తెచ్చుకునేవాడు. ప్రతీ మాటా తనలో తను అనుకునేవాడు. ఆమె ప్రతి కదలికనూ ఆలోచించుకొని తన్మయత్వం పొందేవాడు.

ఇంక ఎన్నాళ్ళకి వస్తుందో సెకనులతో సహా లెక్కపెట్టేవాడు. వచ్చిన తర్వాత బెంగుళూరు చల్లని గాలికి ఆమె వొళ్ళూ మొహమూ యింకెంత అందంగా అవుతాయో, తన వివాహ ప్రతిపాదనకి ఎలాగ సిగ్గుపడి ఓరగా చూస్తూ 'అలాగే' అని అంగీకారం సూచిస్తూ నవ్వు తుందో, తమ దాంపత్య జీవితం....ఓ రోజున సుమిత్రకి వేవిళ్ళని అమ్మ వచ్చి తన చెవిలో ఊదటం కబుర్లు, ముద్దులూ, కౌగిలింతలు, సర్దాలు, ఔాల అలుకలు, షికార్లు....

ఫక్కున నవ్వుకున్నాడు సుబ్బారావు. బల్లమీద అద్దంలో మూడూబై అయిదవవంతు అతని ప్రతిబింబంకూడా ఫక్కున నవ్వింది.

సెకండరీగ్రేడు స్కూలు టీచరు సుబ్బారావు మిల్ ఓనర్ కోటీశ్వరరావుగారి అల్లుడు.

మూడూబై అయిదవవంతు అద్దంలోకి అరమోడ్పు కన్నులతో చూశాడు సుబ్బారావు!

భవిష్యత్తుని గురించిన ధీమా ప్రాణవాయువులా వెళ్ళి అతని ఛాతీని రెండంగుళాలు పెద్దది చేసింది.

అతని యౌవనం అందమైన స్వప్నాన్ని దండగా అల్లి అతని మెడలో వేసింది.

స్వప్నాలు నిజాలు కాబోయే ఆ క్షణంకోసం అతను జీవితపు మెయిన్ రోడ్డుమీద నిలబడి చూస్తున్నాడు.

అలా చూస్తూ నిలబడివుండగా పోస్టుమన్ ఉత్తరం తీసుకువచ్చి ఇచ్చాడు. ఆతృతతో విప్పి చదివాడు :

"రేపు మధ్యాహ్నం బండికి వస్తున్నాము. సాయంత్రం కలుసుకో—సుమిత్ర."

అతను చేసిన అస్పష్ట ఆనందరవానికి – కంగారుగా వెనకాల తల్లీ చెల్లెలూ వచ్చి నిలుచున్నారు.

"అమ్మా – సుమిత్ర రేపు వస్తోందమ్మా."

"సాయంత్రం నన్ను కలుసుకోమందమ్మా."

"అడిగి తేల్చేసుకుంటానమ్మా" గబగబా అనేశాడు సుబ్బారావు.

"ముహూర్తం త్వరగా పెట్టించెయ్యి. ఏకంగా సెలవు పొడిగించవచ్చును. ఆ తరువాతనుంచీ స్కూలుకి మానకుండా వెళ్ళొచ్చును." అంది తల్లి.

అమాయకురాలైన తల్లికేసి ఎంతో సానుభూతితో చూచాడు."ఇంకా నాకు ఆ వెధవ స్కూలు మేష్టరీయేనా అమ్మా."

"అదేమిట్రా. నెలకి కరకుల్లాగా ఎనభై రూపాయలు వస్తూంటే కాదంటావూ....నీకు మాత్రం యేదో పనిలేకపోతే యేం తోస్తుందీ." అంది తల్లి.

"ఎనభై రూపాయలంటే నీకూ, నాకూ, పక్కింటి బ్యాంకి గుమాస్తాగారికీ, అవతల ఇంటి టైపిస్టు స్వరాజ్యమ్మగారికీ గొప్పగాని – సుమిత్ర కేమిటమ్మా. కోటీశ్వరరావుగారింట్లో నౌకర్లకి మూడువందల రూపాయల జీతాలమ్మా. సుమిత్ర సాదరు నెలకి అయిదు వందలయితే

యింత తక్కువ ఖర్చు పెట్టుకుంటున్నావేం. ఒంట్లో బాగులేదా అని కూకలేస్తాడమ్మా వాళ్ళ పాదరూ!" అన్నాడు సుబ్బారావు

"నిజంగా?" అంది ముక్కుమీద వేలుపెట్టుకుని తల్లి.

సుబ్బారావుకి తిరిగి ప్రకృతి, పరిసరాలూ అన్నీ రమణీయంగా కనుపించాయి. రాత్రి అంతా ఒక్కడూ బుల్‌బుల్‌మీద హాయిగా ఏ సంకోచమూ లేకుండా ఎన్నో పాటలు పాడుకున్నాడు. తర్వాత రోజున చాలా ఆలస్యంగా పక్కమీదనుంచి లేచాడు. సూర్యకాంతి తెల్లగా వెచ్చగా రోడ్డుమీదా, రోడ్డు అవతలి తురాయి చెట్లమీదా, ఆఖరి తురాయి చెట్టుకొమ్మచివర వ్రాలిన పాలపిట్ట రెక్కలమీదా పడుతోంది బెదరూ బెంగాలేని ఏవో కొత్తలోకంలోకి వచ్చాననుకున్నాడు సుబ్బారావు.

అందంగా రెండుగంటలు ముస్తాబై సాయంత్రంవేళ బయలుదేరిన సుబ్బారావు హృదయం కొంచెం సంకోచంతో రెపరెపలాడినా, ఎక్కువగా ధీమాతోనే కొట్టుకుంటోంది. పేరూ, ప్రతిష్ఠా, హోదా, సావకాశమూలేని అతని జీవితం ఈ రోజున ప్రేమతో పునీతమై ఉన్నతమై నిలబడింది. ప్రేమించి-ప్రేమకోసం బికారులైనవాళ్ళ చరిత్రని తాను చదివాడు. కాని ప్రేమతోపాటు సిరిసంపదకూడా పొందబోయే తన యీ అదృష్టం ఎక్కడ రాసిపెట్టివుంది? భగవల్లీల అంటే ఇది కదా. మనస్సులోనే భగవంతుడికి వినమ్రుడై ప్రణామ మాచరించాడు.

"హలో - సుబ్బారావు" సరదాగా నవ్వుతూ చెయ్యి ఊపింది సుమిత్ర. ఈ రెండుమూడు వారాలకే కొత్తగా మరింత అందంగా కనపడింది. తలంటుకొన్న ఆమె శిరోజాలను గుబురుగా చేర్చి కట్టిన గులాబిరంగు రిబ్బను అదేరంగు మెడమీదపడి ముద్దువస్తోంది.

"సుమిత్రా" అన్నాడు సుబ్బారావు.

గబగబా ముందుకువచ్చి సుమిత్ర ఎంతో ఆప్యాయంగా కరచాలనంచేసింది.

"అరె! బుల్‌బుల్‌కూడా తీసుకువచ్చావే-"నవ్వింది.

"నీకు పాడి వినిపించాలిగా"

"అవును- అప్పుడే మరి సాధిక చేశావా ?"

"నా కిదివరకు వాయించడం వచ్చును."

హాల్లో సోఫాలో, కూర్చున్నారు.

"ఏమిటి మన ఊరు విశేషాలు ?" అంది సుమిత్ర,

"ఏముంది. నాకేం తోచలేదు. స్కూలుకి కూడా శెలవు పెట్టానుగా."

"బెంగుళూరులో నేనూ మా బావ కారులో ఊ——తిరగడమే నే న సమానూ నీ కబుర్లు చెపుతూంటే 'ఎవరాయన' అనేవాడు. నా బెస్టు ఫ్రెండు అనేదాన్ని."

"మీ బావనుకూడా తీసుకురాకపోయ్యావా ?"అన్నాడు స్పోర్టింగ్‌గా సుబ్బారావు.

అదేమిటో సుమిత్ర చటుక్కున సిగ్గుపడింది, ఒక సెకనులో నవ్వుతూ అంది. "మా బావా, అత్తా అందరూ మాతో వచ్చారుగా. రా, నిన్ను పరిచయం చేస్తాను" అంటూ సుమిత్ర, మొదట సుబ్బారావుకి పరిచయం కలిగించిన పడకగదిలోకి తీసుకువెళ్ళింది. ఇదివరకు సుమిత్ర పడుకున్న మంచంమీద వెల్వెట్‌దిండ్లు నానుకుని ఒక యిరవై ఎనిమిది సంవత్సరాల యువకుడు సిగరెట్‌పొగ సాఫీగా వదలుతూ పడుకున్నాడు.

చామనఛాయగా, బలంగా ఉన్నాడు. కళ్ళు చిన్నవి, జుట్టు పల్చగా నొసలుదగ్గర-కళ్ళకి జోడు. మాంచి ఠీవిగా మాత్రం ఉన్నాడు.

"బావా, ఇతనే నేను చెప్పిన సుబ్బారావు !"

కరచాలనం, కుశల ప్రశ్నలూ అయాక తీరికగా కూర్చున్నారు.

సుబ్బారావు నిట్టూర్చాడు – హమ్మయ్య అని.

ఎందుకు ?

అతను తనంత అందగాడు కానందుకు. ఇంక ఫీల్డుమీద శత్రువులు లేరు తనకి! లోపల ఎక్కడో భయంభయంగా దాక్కున్న ఆ సంకోచం కాస్తా తొలగిపోయింది.

అత నేవేవో కబుర్లు అమెరికాని గురించి, ఫ్రాన్సుని గురించి చెప్పాడు.

'చాలా మంచివాడు. నిగర్వి' అనుకున్నాడు సుబ్బారావు.

"మీరు బుల్ బుల్ మీద పాడతానని మాటిచ్చారుటగా సుమిత్రకి. మరి పాడండి. ఆ ఆనందంలో నేనూ కొంత పాలు పంచుకుంటాను."

"ఇప్పుడెందుకులెండి" సిగ్గుపడ్డాడు సుబ్బారావు.

"ఉహూ, పాడాలి సుబ్బారావు" అడిగింది సుమిత్ర ఆప్యాయంగా. ఆ గొంతు, ఆ చూపు, ఆ తియ్యదనం – వాటికోసమే బతికాను అనుకున్నాడు సుబ్బారావు. బుల్ బుల్ మీటుతూ పాడాడు.

చిరుచీకటి గదినిండా వ్యాపిస్తూండడం ఎవరూ గమనించలేదు. అతని పాటలోని భావమూ, మధురిమా ఆ మునిమాపులో శ్రోతలిద్దర్నీ అవ్యక్తానుభూతులతో నింపివేశాయి.

కాస్సేపటికి రాఘవరావు – సుమిత్ర బావ – నవ్వుతూ అన్నాడు.

"లైటు వేయడంకూడా మరిచిపోయావు సుమిత్రా."

"అరె! సుబ్బారావు పాడితే నే నేదోలా అయిపోతాను." అంటూ సుమిత్రలేచి లైట్లు ఆన్ చేసింది.

"మీ స్నేహాన్నే ఎప్పుడూ కోరుతాను, మీ పరిచయం కలగడం నా అదృష్టం" అన్నాడు రాఘవరావు సుబ్బారావుతో.

"ఎంత మాట"

"ఇంకా యీ పూళ్ళో నెల్లాళ్ళవరకు ఉండాలి కదా. మీరు రోజూ వస్తూ పోతూండాలి. ఏమంటావు సుమిత్రా" అంటూ సుమిత్ర వైపు చూశాడు రాఘవరావు.

"అవును తప్పకుండా" అంది సుమిత్ర.

రాఘవరావు మంచందిగి సుబ్బారావుతో కరచాలనంచేసి, "మామ గారితో మాట్లాడవల్సిన పనిఉంది ఎక్స్యూజ్ మీ. సుమిత్రా, నీ చేత్తో నువ్వే సుబ్బారావుగారికి శుభలేఖ ఇయ్యి. ఇంకా కొన్ని శుభలేఖలు ఆయనచేత టీచర్లకి, వాళ్ళకి పంపిస్తానన్నావుగా" అంటూ అద్దం ముందు నిల్చుని తల దువ్వుకుంటున్నాడు.

సుమిత్ర కొంచెం సిగ్గుతో కొంచెం నవ్వుతూ "అవును తీసుకు వస్తా." అంటూ లోపలికి వెళ్ళి ఓ నిముషంలో ఒక కట్టని తీసుకువచ్చి సుబ్బారావు చేతిలో పెట్టింది.

శుభలేఖని చూసిన సుబ్బారావుకి కళ్ళు చీకట్లు కమ్మాయి. ఎవరో నెత్తిమీదనుంచి ఒక పెద్ద మేకుని గుండెలదాకా కొట్టినట్టయింది. అతని కడుపుని చీల్చి పేగుల్ని యివతలికిలాగి తెంపేస్తోన్నట్టు అనిపించింది. చావుకన్న భయంకరమైన అనుభవం ఆతనికి హఠాత్తుగా కలిగింది. పిడుగుపడిన వాడిలాగా నిశ్చేష్టుడై నోట మాటలేక అలా ఉండిపోయాడు.

"అదేం సుబ్బారావ్, ఈ మాత్రం సహాయం చెయ్యలేవా. చూడు నీ మేరేజ్‌కి నేను ఎంత ఏక్టివ్‌గా ఉంటానో" అంది నవ్వుతూ సుమిత్ర.

"వస్తానండీ గుడ్‌నైట్" అంటూ తల దువ్వుకోవడం పూర్తి అయిన రాఘవరావు గదిలోంచి వెళ్ళిపోయాడు.

"అరె! అలా తెల్లబోయి నుంచుంటావేం! ఇంకా కంగ్రాచ్యులేషన్సు చెప్తావనుకుంటున్నాను" అంది ఆశ్చర్యంతో సుమిత్ర.

నీటిలోని ప్రతిబింబంలాగా సుమిత్ర రూపం కళ్ళఎదుట చెదిరి పోతోంది. చుట్టూఉన్న గోడలు కరిగి కూలిపోతున్నాయి. చర్మరంధ్రా ల్లోంచి రక్తం బయటకి చిమ్మేస్తుంది. కాస్సేపటికి కుర్చీలో కూలబడి "ఎంతపని చేశావ్ సుమిత్రా" అన్నాడు బొంగురుగా ఏడుపుగా.

"ఏం ముందుగా నీకు చెప్పలేదనా కోపం సుబ్బారావూ ? నన్ను క్షమించు" జాలిగా తీయగా అడిగింది సుమిత్ర.

"కాదు, నిన్ను నేను ప్రేమించాను. నన్ను పెళ్ళి చేసుకుంటా వనుకున్నాను"-అన్నాడు సుబ్బారావు. ఎలా అన్నాడో తనకే తెలియదు.

"నిన్నా!" ఈసారి సుమిత్ర ఆశ్చర్యంతో స్తంభించి పోయింది. ఆమె కొక్కసారి పరిస్థితి అంతా అవగాహన అయింది. కంగారు పడింది. కాని ఆడవాళ్ళకుండే ఒకగొప్ప సౌలభ్యంతో మామూలు మనిషై, సాదాగా నవ్వుతూ యిలా అంది. "పెకండరీగ్రేడు మేష్టరువి సుబ్బారావు. నీ కిచ్చి నాన్న ఎలా పెళ్ళి చేస్తాడనుకున్నావు."

"నిన్ను నేనెలా పెళ్ళిచేసుకుంటాను"-అని అంటే ఆమె స్త్రీలకి ప్రతినిధి కాకపోను. అక్కడే ఆమె చాతుర్యం ఉంది. ప్రయత్న పూర్వ కంగా అలాగ ఆమె అనలేదు. అలాగ తండ్రిని అడ్డంపెట్టి మాట్లాడాలనే ఔచిత్యం ఆమెకి సహజంగానే అలవడింది.

"సుబ్బారావు."

....

"నువ్వంటే నాకు ఎంత స్నేహభావం! ఆ స్నేహమూ ఈ అనురాగమూ ఏమీ కాదా! కోపమా సుబ్బారావు. నా మేలునీ, అభివృద్ధిని కోరేవాడివి కదా. ఏది ఒట్టువెయ్యి మన మైత్రికి ఏ అంతరాయమూ కలగదనీ."—

కళ్ళల్లోకి చూస్తూ అనునయంగా అడిగింది సుమిత్ర.

ఒట్టువేశాడు సుబ్బారావు. తనకి తెలీకుండానే.

"ఈ శుభలేఖలు మనవాళ్ళకి యిచ్చి వేస్తావుకదూ. రేపు సాయంత్రం స్కూలు వదలగానే వచ్చెయ్యాలి సుమీ. నేనూ బావా నీకోసం కనిపెట్టుకుంటాం. అదుగో నాన్న పిలుస్తున్నాడు. వస్తా-ఏం, వెళ్ళనా సుబ్బారావు."

తల ఊపాడు సుబ్బారావు.

"అమాయకుడివి సుబ్బారావు" అని అతని భుజంమీద చెయ్యివేసి వెళ్ళిపోయింది సుమిత్ర.

ఒక చేత్తో శుభలేఖల కట్టతో; ఒక చేత్తో గుండెల్ని పట్టుకుని మతిలేనివాడిలాగ గదిలోంచి హాలులోకి, హాలులోంచి వీధిలోకి వచ్చాడు సుబ్బారావు. గోపి:-"మాష్టారూ" అనివేసిన కేక అతనికి వినపడలేదు. అప్పుడే బాగా చీకటిపడింది. నల్లని తారురోడ్డు మీద విద్యుద్దీపాలకాంతిలో మగతగా నడుస్తున్నాడు సుబ్బారావు. ఎక్కడికి వెళ్ళుతున్నాడో అతనికి తెలియదు. ఏవో మలుపులు తిరుగుతున్నాడు. ఎక్కడికో వెళుతున్నాడు. కొంతసేపటికి ఊరిచివరకి వచ్చాడు. అక్కడ నుంచి తానూ సుమిత్రా షికారుకువచ్చే నదివొడ్డుకి వచ్చాడు. అక్కడ అంతా చీకటి. ఏవో కీచురాళ్ళ కూతలు. ఎవరో పరుగెత్తుతూన్నట్టు అస్పష్టమైన ధ్వనులు. ఆకులు – రాలిన ఆకులలోంచి తొండలు కదలిన చప్పుళ్ళు. నీరసంగా శూన్యంగా ఉన్న చీకటి. అలాగే వెర్రివాడిలా నుంచునిపోయాడు. అతని క్షుభితమనస్సుతో ఏ సంబంధమూ లేకుండా నది చిన్న చిన్న ఆలలతో ప్రశాంతంగా ప్రవహిస్తోంది. తాటితోపులో చీకటి మరింత చిక్కపడుతోంది.

సుబ్బారావు ఒక్కసారిగా చేతిలోంచి శుభలేఖల్ని జారవిడిచి బావురుమన్నాడు. అతను మొహం రెండు చేతులతోనూ కప్పుకుని

ఏడ్చాడు. నేలమీద కూలబడి ఏడ్చాడు. అతనికి ఏడుపు ఆగలేదు. వెక్కి వెక్కి ఏడ్చాడు.

ఆ ఏడుపు అక్కడి చప్పుళ్ళతో కలసి మళ్ళీ విడిగా తడిగా వినబడుతోంది.

ఎదురుగా నదిలో నక్షత్రాలు మినుకు మినుకుమంటూ ప్రతిబింబిస్తున్నాయి. అతని వెనుకాలనే తాటిచెట్లు విధి నియోగించిన రక్షకభటులలాగ నిశ్శబ్దంగా కఠినంగా నిలబడి ఉన్నాయి.

జాలిగా తల్లిలాగా సుబ్బారావుని చీకటి చుట్టుకుంది.

(1961)